

# నిన్నటిదాకా శిలనైనా...

నేను ఖమ్మం కాలేజీనించి జగిత్యాల ఎస్.కె.ఎన్.ఆర్. కాలేజీకి ట్రాన్స్‌ఫర్ అర్డర్లందుకొని చాలా సంతోషపడ్డాను, అక్కడ నాకు బంధుమిత్రులెవరూ లేకున్నా ఇక్కడి నా చుట్టూవున్న కుళ్ళు మనుషులనించి దూరంగా పారిపోవాలనే ప్రయత్నంలో... ఆర్డర్స్ చేతికి రావటం....

చాలా రోజుల తర్వాత సినిమాకొచ్చాను. నేను చిత్రాలు చూడక ఏడాది

దాటిందేమో? రిజర్వేషన్ బుకింగ్ క్యూలో నిల్చున్న నాకు కొద్ది దూరంలో సైకిల్ మోటార్ ఆగటంతో తలత్రిప్పి చూశాను.

అతను శ్రీధర్.

వెనుక సీట్లో ఆమె!!

చూట్టూ దోపుకున్న పమిటను తీస్తూ వయ్యారంగా దిగింది. అదే సైకిల్ మోటార్‌మీద ఆమె కూచున్న స్థానం ఒకప్పటి నా స్థానం! శ్రీధర్ని చూశాను నిర్లిప్తంగా... బాగా మారిపోయాడు. ఆమె చాలా అందంగా వుంది. ఆమెని దించి బైక్‌ని పార్క్ చేయడానికి వెళ్ళాడతను. ఆమె అందంగా నడుస్తూ వచ్చి కొద్దిగా సందు చేసుకుని నా ముందునిల్చుంది. నేనేమి అనలేపోయాను. కాని మనసులో "చలాకీదే" అనుకున్నాను.

నా కళ్ళల్లో కప్పుకున్న నీటితెరల్ని కన్పించనివ్వక భూజాలమీదుగా కొంగు కప్పుకొని నిల్చున్నాను. నా ముందు నిల్చున్న ఆవిడను అంత దగ్గిరగా నఖశిఖ పర్యంతం పరిశీలిస్తున్నాను. పాలరాతి బొమ్మలా ఉంది.

ఆమె మెడలో నల్లపూసల్తో గ్రుచ్చిన తాళిబొట్టు!

శ్రీధర్ మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడేమో...??

అతనినించి విడాకులు పొందిన భార్యగా.. ఏడాదిన్నర తర్వాత శ్రీధర్ని చూసింది ఈ రోజే.

"గుడ్‌మార్నింగ్ మేడమ్!"

తల త్రిప్పి చూసాను. నా పిల్లలు... కాలేజీ స్టూడెంట్స్... మంజుల, రమ్య, వనజ, సుచేతా.

"మీరు సిన్మాకి రావటం ఆశ్చర్యంగా వుంది" అంది వనజ.

నేను నవ్వాను. వాళ్ళు నా ప్రక్కన చేరి మాట్లాడుతుండడంతో నా ముందు నిల్చున్న "ఆమె" వెనక్కి తిరిగి చూసింది. నేనామె ముఖాన్ని స్పష్టంగా చూశాను.

తిలక్ వెన్నెల్లో ఆడపిల్లలా వుంది...

వనకన్యలా వుంది... వరూధినిలా వుంది...

"దమయంతి లెక్చరర్... మీకు ట్రాన్స్‌ఫర్ అయిందటగా... మేం వెళ్ళనివ్వం. స్ట్రయిక్‌లు, నిరాహారదీక్షలు చేసి అయినా సరే మిమ్మల్ని రప్పించుకుంటాం" అంది రమ్య, రమ్య చాలా గడుగ్గాయి. "సిన్మా దగ్గర ఆ విషయాలెందుకు చెప్పు... తర్వాత మాట్లాడదాం" అన్నాను.

నాకు తెలుసు.

కాలేజీలో నేనంటే ప్రతి ఒక్కరికి అభిమానమే. రమ్య నిర్మొహమాటంగా చెప్తుండేది.

"దమయంతీజీ... మీరు చరిత్రపాఠం చెబుతుంటే చరిత్ర కంటే కూడా నిండుగా కన్పిస్తారు. ముఖ్యంగా మీ కంఠం... వన్ ఆఫ్ నైటింగేల్ పల్చటి ఫ్రేములో వున్న మీ కళ్ళద్దాలు కనుబొమ్మల మధ్యనించి పైకెక్కే సూరీడులా ఎర్రబొట్టు...

పాపిట మొదట్లో కొంచెం రాల్చుకున్న కుంకుమ నిండయిన మీ శరీరం... పాఠం చెప్పే తీరు, నిజంగా టీచర్, అసలు లెక్చరర్ అంటే మీలాగా వుండాలన్పిస్తుంది." అనేది. నా క్లాసెప్పుడూ పిన్‌డ్రాప్ సైలెంట్‌గా వుండేది. నేను అబ్బాయిల్తో, అమ్మాయిల్తో తోటి లెక్చరర్స్‌తో కల్సి వుండేదాన్ని.

అంతలో బుకింగ్ కౌంటర్ తెరిచినట్లు బెల్ మ్రోగటంతో 'క్యూ'లో చలనం వచ్చింది. అప్రయత్నంగా నా కళ్ళు శ్రీధర్ కోసం గాలించాయి. నా ముందు "ఆమె" రెండు టిక్కట్లు తీసికొనిపోయింది. నేనూ టికెట్ తీసి కొని వచ్చి హాల్లో కూర్చున్నాను. చిత్రం మొదలయ్యే ముందు ఆమె వచ్చి సీటు నెంబర్ చూసి నా ప్రక్కనే కూచుంది. అటుపక్క శ్రీధర్... గుడ్డి వెలుతుర్లో చూస్తే నా గుండె దడ పెరిగి చిక్కని ఆవేదన నరనరాల్లో ప్రవహిస్తోంది. మాజీ భర్తగా... అతడి ఆలోచనలు ఉబికివస్తుంటే అణిచిపెడుతున్నాను.

"ఇన్‌సిగ్నిఫికెన్స్"

సినిమా పేరు పడటంతో సర్దుకు కూచున్నాను. ప్రఖ్యాత దర్శకుడు నికోలా రోయెగ్ చిత్రాలంటే నాకు చాలా ఇష్టం. అతడు తీసిన ఏడు సిన్మాల్లో అయిదు చూసాను. ఆ అభిమానంతోనే "ఇన్‌సిగ్నిఫికెన్స్" చూడాలని వచ్చాను. సినిమా మొదలైంది. ప్రక్కనే "కిస్" తీసుకున్న చప్పుడు. తల తిప్పకుండా... కళ్ళు తిప్పి చూసాను.

శ్రీధర్ అప్పుడే కార్యక్రమం మొదలెట్టాడేమో. ఆమె మెలికలు తిరిగిపోతుంది. హీరోయిన్, సెనేటర్, బాల్‌ప్లేయర్, ప్రొఫెసర్... కేవలం నాలుగు పాత్రలతో నడిచే సిన్మా అది. బాల్ ప్లేయర్ విచిత్రమైన మనిషి, సెనెటర్

పోమరిపోతు. ప్రొఫేసర్ తన 'కాళ్ళను' గొప్పగా ప్రదర్శించేటపుడు "నికోలా"కు మనసులోనే జోహార్లర్పించాను.

"హిరోయిన్ బాగుంది కదూ" శ్రీధర్ అంటున్నాడు.

"సర్లెండి" కోపగించుకుందామె. ఆమె ఉత్తి అనుమానం మనిషిలా తోచింది నాకు.

"అనుమానం..." నా జీవితాన్ని ఆకులా రాల్చేసిన చిన్న పదం. సినిమాలో నటి సాపేక్ష సిద్ధాంతం గురించి లెక్చర్ ఇస్తున్నప్పుడు నన్ను నేను మర్చిపోయాను. "ఇన్‌సిగ్నిఫికెన్స్" లో భవిష్యత్తును ప్రశ్నించేటపుడు నా ఆలోచనల్లో నా భవిష్యత్తు కదలాడి బాధ పెట్టింది. సినిమాలో గతం పునఃపరిశీలన చేయబడుతుంటే...

అక్కడే... అక్కడే... నేనూ నా గతంలోకి జారిపోయాను.

ఆ రోజు శ్రీధరింకా ఆఫీసునుంచి రాలేదు.

నేను కాలేజీనించి రాగానే చీరలు పిండేసి డాబామీద ఆరేస్తున్నాను. ఎక్కడ్నించో శ్రావ్యమైన సంగీతం గాలి తరంగాల్లో కల్సి నా చెవుల్ని తాకితే "ఎవరీ విద్వాంసుడు" అని చూసాను.

ఎదురింటి డాబామీద ఆ కుర్రాడు... రామారావు!

రామారావు నా స్టూడెంటు. బి.ఏ. సెకండియర్ చదువుతున్నాడు. కాని సంగీత కళాకారుడని నాకు తెలీదు. తన్మయంతో అలాగే నిల్చున్నాను. అతడు వాయిస్తున్నది "బుల్‌బుల్ సితార్" "ఆజ్‌కీ అంగారె" సిన్మాలోని పాటది.

ఆ సంగీతానికి గుండె పొరల్లో గునపాలు గ్రుచ్చి పెకిలించిన ప్రాణం కింద ఆ రవళి పునాదిగా మారి నన్ను ఉన్మత్తురాలిని చేస్తోంది. నాకు సంగీతమంటే ప్రాణం. రకరకాల కేసెట్లు తెచ్చి వింటుంటాము.

అతడది పూర్తి చేసి, తెలుగులో "చిత్ర" పాడిన "అల్లరికళ్ళ... మరదలుపిల్లా..." అనే పాట చరణాన్ని ప్రయత్నిస్తున్నప్పుడు చీరలు ఆరేసి "మిస్టర్ రావ్" అని గట్టిగా పిల్చాను. విన్పించలేదేమో రెండు మూడు పిలుపులకు గాని తలెత్తలేదు. నన్ను చూసి గాబరా పడ్డాడు. "నువ్వొకసారి మా ఇంటికిరా" అన్నాను. నేను డాబా దిగేసరికి క్రింద వున్నాడు.

"చదువుకొనేవాడ్నే... కానీ... రోజుకి అరగంటైనా అది ముట్టుకోనిదే ... నాకు ప్రాణం... నిలవదు...." అతడి భయానికి నాకు నవ్వొచ్చింది.

"అది కాదోయ్, నువ్వంత మధురంగా సితారమీద రాగాల్ని కలబోస్తావని నాకు తెలీదు. నీ బుల్ బుల్ సితారతో ఈరోజు నాకు పాటలు విన్పించాలి".

"కాని టీచర్... నాకు... నాకు..." తడబడ్డాడు.

"నాకు లేదు... నీకు లేదు... ఈ రోజు పాటలు విన్పిస్తున్నావ్" అన్నాను కండీషన్‌గా.

ఆ సాయంత్రం

అతడు నా ముందు కూచుని సగం విరిగిన బ్లేడు ముక్కని కుడిచేత్తో పట్టుకొని తీగెలు వాయిస్తూ... ఎడంచేత్తో బటన్స్‌ని నొక్కుతుంటే... అతడి చేతులు వణుకుతున్నాయి.

నేను నవ్వాను.

కొంచెం రంగుతక్కువయినా... అమాయకమైన అతని మొహంలో బెరుకుతనం కనిపిస్తోంది. తడబాటుని కప్పిపుచ్చుకొని "మీ కిష్టమైన పాట చెప్పండి" అన్నాడు.

చెప్పాను

బ్రహ్మాండంగా ఆ తీగల్లో రాగాలాపన చేసాడు. మనసు మంచినీరై కరిగిపోయింది. రామారావ్ వెళుతుంటే శ్రీధర్ వచ్చాడు.

"అబ్బాయిలకు ట్యూషన్స్ చెప్పవద్దని చెప్పానా?" శ్రీధర్ కొంచెం కటువుగానే అన్నాడు. అప్పటికి పెళ్ళయి మూడేళ్ళయింది. మాకు పిల్లలు కలుగలేదు. అది నా తప్పేనని శ్రీధర్ కొద్ది రోజుల్నుంచి అసహనంగా చిరాకుగా ప్రవర్తిస్తున్నాడు.

"ట్యూషన్ కాదండి... ఆ అబ్బాయి బుల్‌బుల్ సితార బాగా..."

"చాల్లే... సితారలూ... సంగీతాలేనా... నా మొహాన కాఫీ పోసేది ఏమైనా వుందా?"

నేను మౌనంగా వంటింట్లోకి నడిచాను.

మరో రోజు రామారావ్ మరిన్ని పాటలు విన్పించి వెళ్ళాడు. ఆ తర్వాతి రోజే... అతడు ముఖేష్ పాటని అద్భుతంగా ఆ సితారమీద విన్పిస్తున్నాడు. నన్ను నేను మర్చిపోయి వింటున్నాను.

అతడి వ్రేళ్ళు చిత్రంగా సితారమీద కదులుతుంటే 'శిలనై' ఆ వ్రేళ్ళవంక

చూస్తూ తన్మయ డోలికల్లో ఊగిపోతున్నాను. అంత చిన్న వయసులో అద్భుతమైన కళను అపాదించుకున్నందుకు చేతులెత్తి నమస్కరించాలనిపించింది. నాలుగో పాట తీగల్లో పలికిస్తున్నప్పుడు... ఎప్పుడొచ్చాడో శ్రీధర్ "స్టాపిట్" అని అరిచినంత పనిచేసాడు. నేను గబుక్కున లేచి నిల్చున్నాను. రామారావు వెళ్ళిపోయాడు.

"కొంపలోకి మొగుడొచ్చాడన్న ధ్యాస ఏమైనా వుందా?" అతడి కళ్ళు ఎర్రబడి వున్నాయి.

"ఎందుకలా అయిపోతున్నారు?"

"యూ స్టుపిడ్... నేనొచ్చి ఎంత సేపయిందో తెల్సా?"

"ఆ ధ్యాసలో పడి...?"

"ఏ ధ్యాసలోపడి?"

నేను అనుమానంగా చూసాను ఆయనవైపు. షర్టు విడిచి విసురుగా సోఫా మీద పడేశాడు.

"స్నానం చేసిరండి.. కాఫీ తెస్తాను"

"సంగీతం వినాలంటే దూరంనుంచైనా వినొచ్చు. అంత దగ్గరగా కూచుండాల్సిన అవసరమేముంది?"

ఆయన ముఖంలో ముడివేసిన కనుబొమ్మల మధ్య మొలకెత్తిన అనుమానాన్ని నేను చేసాను.

"అంటే...?" తీవ్రంగానే అడిగాను.

"నా నోటితో చెప్పాలని ప్రయత్నించకు... ఇంకెప్పుడూ పిచ్చి పిచ్చి పనులు చేయకు" అని విసురుగా బాత్‌రూంలోకి పోయాడు.

మొదటిసారిగా ఏడ్చాను...

ఇద్దరి మనుషుల మధ్యదూరంలో... ఒక జీవితాన్ని కుప్పకూల్చే అనుమానాన్ని పాతాడాయన. దాన్ని పెనువృక్షం కానీయకూడదు.

మూడేళ్ళ కాపురంలో అతని ప్రవర్తనకి చాలా సేపు ఏడ్చాను.

మర్నాడు కాలేజీలో రామారావు దీనంగా కనిపిస్తే అడిగాను. నీరసంగా వున్నాడు. తలవంచి, గోళ్ళు గిల్లుకుంటూ చెప్పాడు.

"టీచర్... రేపే ఎగ్జామ్ ఫీ లాస్ట్‌డేట్... ఇక్కడ్నించి మా 'గౌరీ దేవిపేట' వెళ్ళి తెచ్చుకోవాలంటే ఒక రోజు పడుతుంది. ఇప్పటిదాకా ఇంటి నుంచి మనియార్డర్ కోసం ఎదురుచూశాను." అన్నాడు. మాకు ఆ రోజే సాలరీస్ వచ్చాయి.

"నన్నడగొచ్చుకదా! ఇదిగో డబ్బు... వెళ్ళి ఎగ్జామ్ ఫీజు చెల్లించు. ఎం.వో. రాగానే ఇచ్చేద్దువుగాని..." అని హ్యాండ్ బ్యాగ్ లోంచి నూటయాభై రూపాయలిచ్చాను.

ఆ కుర్రాడి కళ్ళల్లో నీరు కదలాడితే... ఆ కళ్ళ గోళాల నిండా నా ప్రతిబింబం కన్పించింది.

ఆ రాత్రి శ్రీధర్ "నీ జీతంలో నూటయాభై తక్కువున్నాయేం?" అనడిగాడు. అతడు పూర్తిగా డబ్బు మనిషి.

"రామారావుకిచ్చాను"

క్షణంలో నా చెంప పగిలిపోయింది. 'డామిట్... వాడికెందుకిచ్చావ్' ఉగ్రుడయ్యాడు. అహంకారంతో హుంకరించాడు. నేనేం చెప్పకుండా మౌనంగా రోదిస్తూ వుండిపోయాను.

రెండు రోజులు మామూలుగా గడిచాయి. మూడోరోజు సాయంత్రం రామారావు మాఇంటికొచ్చాడు. ఆ సాయంత్రమే... నా జీవితాన్ని కుప్పకూల్చేస్తుందని వూహించలేదు. నూటయాభైరూపాయలిచ్చి థాంక్స్ చెప్పాడు. నేను నవ్వి తీసుకున్నాను.

"టీచర్"

"నాట్ టీచర్... ఆయాం లెక్చరర్" అన్నాను నవ్వేస్తూ. వెంట బుల్‌బుల్ సితార కూడా వుంది.

"మేడమ్... మీరు చేసిన సాయానికి కృతజ్ఞతలు. అందుకే మీకే రోజు ఒక క్రొత్త రాగం విన్పిస్తాను. ఇన్నాళ్ళు విన్న పాటలు ఒక ఎత్తు ఇప్పుడు వాయించేది మరో ఎత్తు. చాలా కష్టపడి నేర్చుకున్నాను. ఇది నాగిన్ మ్యూజిక్. ఇలాంటి సితార మీద వాయించటమంటే మామూలుకాదు. చెప్పండి, విన్పించమంటారా?" అన్నాడు.

నేను భయంగా గుమ్మం వైపు చూసాను. శ్రీధర్ రావడానికి అరగంట టైముంది. 'సరే' అన్నాను.

సగం విరిచిన బ్లేడుముక్కని కుడిచేత్తో పట్టుకొని తీగల్ని తాకిస్తూ... ఎడంచేత్తో బటన్స్ నెమ్మదిగా నొక్కుతుంటే... నాగిన్ సంగీతం నెమ్మదిగా

అద్భుతంగా మొదలైంది.

తన్మయంలో పడ్డాను.

శివుని మెడలోని నాగుపాము వూగి వూగి... హిమ శిఖరాన్ని వదిలి... వేగంగా మా యింటివైపు వస్తోన్న అనుభూతి....

ఢమరుక నాదస్వరాలేవో కైలాసాన ప్రతిధ్వనిస్తున్నటు... శివుని శిరస్సులోంచి గంగ కూడా గలగలా కదిలినంత ఉద్వేగం..

అతడి వ్రేళ్ళు చిందరవందరగా నొక్కుతుంటే అలల్లా కదిలి... కెరటంలా ఎగిసి... శిలను ఢీకొన్న వేగధ్వనిలో మంద్రస్థాయిని చేరిన నాగిన్ సంగీతం వినిపిస్తున్నా.. అతడి వ్రేళ్ళు కన్పించనంత వేగంగా కదులుతున్నాయి సితారమీద.

మంచుకొండలు కదిలి... ప్రచండుడై శివుడు తాండవంచేస్తున్నాడా అనిపిస్తోంది. నాగుపాము నా ఎదుట ఆడుతూ సర్రూన తలను నేలకేసి కొడుతోందా... అన్నట్లుగా అతడు వింత రాగాల్ని పలికిస్తున్నాడు.

చివరిదశలో అత్యంత ఉద్రేకంగా... వ్రేళ్ళు కదిలి కదిలి... ఫట్‌మన్న శబ్దంతో బ్లేడు విరిగి తీగలుతెగి... చూపుడు వేలిని సర్రున చీల్చితే...

రక్తం... ఎర్రటిరక్తం... అమ్మా అన్న ఆర్తనాదం!

సంగీత తరంగాలు ఆగిపోయాయి. కెరటంలా ఎగిసిన రక్తం బొట్లుబొట్లుగా సితారను అభిషేకిస్తోంది. నా గుండెలవిసిపోయాయి. చప్పునలేచి అతడి వేలు నోట్లో పెట్టుకున్నాను. అతడు బాధగా కళ్ళు మూసుకున్నాడు. ఉప్పగా తగిలింది రక్తం!!

అయిదు... పదినిమిషాలు...

చప్పట్లు విన్పిస్తే వాస్తవంలో పడి చూసాను... ఎదురుగా శ్రీధర్?!

మాటలతూట్లుపడి నా రక్తం కూడా పోయింది. మర్నాడు విడాకులు... కాలేజీలో మెరుపులా పాక్కుపోయిన వార్తలు... అలా ఏడాది క్రిందినించీ తను వేరుగా బ్రతుకుతూ తోటి లెక్చరర్ల సూటిపోటి మాటల్ని భరిస్తూ... చివరికి ట్రాన్స్‌ఫర్ అయి రేపే జగిత్యాల్ వెళ్తూ....

'ఇంటర్వెల్'

పడటంతో వాస్తవానికి వచ్చాను. ప్రక్కకి చూసాను. శ్రీధర్ ఎవరో అమ్మాయి వైపు చూస్తే ఆమె అనుమానంకొద్దీ ప్రక్కలో మోచేత్తో పొడిచింది.

"ఉత్త అనుమానం మనిషి" మరోసారి అనుకున్నాను.

శ్రీధర్‌మీద నిలువెల్లా కసి పెరిగిపోయింది.

"నమస్కారం శ్రీధర్‌గారూ..." వాళ్ళ ఆఫీస్ కొలిగ్ రాజ్యలక్ష్మి థియేటర్ బయటికెళ్తూ అంది.

"అదెవర్తి? దాంతో నీకేం పరిచయం?" అంది శ్రీధర్ భార్య కొరకొరా చూస్తూ... అతడేదో చెప్పబోతే గుడ్లురిమి చూసింది. నేను శ్రీధర్‌కు కనబడకుండా జాగ్రత్తగా కూచున్నాను.

"ఏ అనుమానాల్తో నాజీవితం నాశనం చేశావో... నీ అనుమానాల్ని మించిన 'అనుమానవతి' భార్యగా దొరికిందా శ్రీధర్" అనుకున్నాను.

తిరిగి సినిమా మొదలైంది.

హేతువుకి, తర్కానికి అందని చాలా విషయాలమీద సినిమా ఇంట్రస్టుగా సాగింది. సినిమా అయిపోయి మెట్లు దిగుతుంటే.. శ్రీధర్ అతి దగ్గరగా కన్పించాడు.

ఆ అవకాశాన్ని పోనివ్వదల్చుకోలేదు.

పైట సగం జార్చి "ఆమె" చూసేలా...

"హాయ్ శ్రీధర్ డాళింగ్... పెళ్ళయ్యాక కన్పించటమే మానేసావేంటి? రోజా రాత్రి నీకోసం చూస్తున్నాను తెల్సా? ఎన్నాళ్ళీ విరహవేదన డాళింగ్... నేనే కాదు, రోజా, మమత కూడా నీకోసం చూస్తున్నారు తెల్సా? ప్రక్కలో నువ్వు లేకపోతే బోర్‌గా వుంది. ఈ రాత్రి రాకూడదా డియర్...." అని శ్రీధర్ మెడ వంపులో గట్టిగా ముద్దు పెట్టుకున్నాను.

అతడు శిలాప్రతిమలా వుండిపోతే... ఆమె కళ్ళలోంచి అగ్ని పర్వతాలు ప్రేలి బడబాగ్నులు కురుస్తున్నాయి అప్పటికే.

సిగ్గు లేకుండా నాకా ధైర్యం ఎలా వచ్చిందోగానీ... గబగబా అక్కడ్నించి జనంలో కలిసాను. నా మండిన గుండెలోంచి గ్రక్కుతున్న సెగల ఆవిర్లు కళ్ళల్లో కన్నీటిగా మారి జలజలా కారుతూనే వున్నాయి.

"రేయ్ డామిట్... ఏ అనుమానాల్తో నా జీవితాన్ని త్రోసిపుచ్చి కుప్పకూల్చావో... అదే అనుమానంతో నిన్ను కాల్చేస్తున్నాను" అనుకొంటూ కదిలాను.

నాకు తెలుసు... ఆ అనుమానవతితో వాడి జీవితం నరకప్రాయమవుతుందని.

*